

సోమశిలలో 10.09 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 10.09 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 304 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,785
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,989
నవర (8 గ్రాములు)	రూ.55,912

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.4 /24.7

గాలిలో తేమ 78 శాతంగా శనివారం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం ఆదివారం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో అధికారుల తనిఖీలు

నెల్లూరు(సెంట్రల్): నాణ్యత లేని విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. నగరంలోని పలు విత్తనాలు, ఎరువుల విక్రయాల దుకాణాలను వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, లైసెన్స్‌లను తప్పక ఉంచుకోవాలని సూచించారు. నాణ్యతలో రాజీ పడకూడదని తెలిపారు. రైతులకు బిల్లులను తప్పక ఇవ్వాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు శ్రీనివాసులు, నాగమోహన్, సీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లకు పదోన్నతులు

నెల్లూరు(అర్బన్): జిల్లా అటవీ శాఖ పరిధిలో పనిచేస్తున్న నలుగురు సెక్షన్ ఆఫీసర్లకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ (అడ్‌హాక్)గా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ గుంటూరు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. నెల్లూరు డివిజన్ టెరిటోరియల్ రేంజ్ ఆఫీస్‌లో పనిచేస్తున్న నాయబ్ రసూల్ అహ్మద్, కావలి రేంజ్ పరిధిలోని చుండి సెక్షన్లో పనిచేస్తున్న నాగయ్య, రాచర్లపాడు సెక్షన్‌కు చెందిన శ్రీనివాసులు, ఉదయగిరి రేంజ్‌లోని కృష్ణంపల్లి సెక్షన్లో పనిచేస్తున్న మునీర్‌బాబు ఉద్యోగోన్నతులు పొందారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులను ఇక నుంచి క్యూఆర్ కోడ్‌తో ద్వారా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా చెల్లింపులను ఆర్బీఐ ఆదేశాల మేరకు నిలిపేశారని, ఈ క్రమంలో వినియోగదారులు సులభంగా చెల్లించేందుకు వీలుగా ఎస్పీడీసీఎల్ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశామని తెలిపారు. వినియోగదారులు తమ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే 13 అంకెల సర్వీస్ నంబర్‌ను అడుగుతుందని, వీటిని నమోదు చేసి బిల్లులను చెల్లించొచ్చని వివరించారు. క్రెడిట్, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితరాల ద్వారా చెల్లించొచ్చన్నారు.

క్లీన్ ఫ్రూట్ మార్కెట్‌కు సహకరించండి



మాట్లాడుతున్న వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ నెల్లూరు సాకారంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతను వ్యాపారులంతా బాధ్యతగా భావించి క్లీన్ ఫ్రూట్ మార్కెట్ నిర్వహణకు సహకరించాలని ఎంహెచ్‌ఓ వెంకటరమణ పేర్కొన్నారు. నగరంలోని చాకలివీధిలో నెల్లూరు ఫ్రూట్ మార్కెట్ అసోసియేషన్ సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి దుకాణం వద్ద డస్ట్ బిన్‌ను తప్పక ఉంచి, వీటిని ఉపయోగించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్లోని వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని కోరారు. ఫ్రూట్ మార్కెట్లోని దుకాణాల పరిసరాలు, ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసేందుకు ఫ్రూట్స్ అసోసియేషన్ సభ్యులు ఎంపిక చేసిన కొంత మంది వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకురావడంపై ఆనందం వ్యక్తం చేశారు. షిఫ్టుల వారీగా 24 గంటలూ పరిసరాల పరిశుభ్రతను వీరు పర్యవేక్షించనున్నారని తెలిపారు.

జీజీహెచ్‌కు నిర్లక్ష్య గ్రహణం

జిల్లాకే రిఫరల్ ఆస్పత్రిగా ఉన్న నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సమస్యలు నానాటికీ పేరుకుపోతున్నాయి. నైపుణ్యం గల డాక్టర్లు.. పెద్ద భవనాలు.. ఇలా అన్ని రకాల వసతులున్నా, రోగులకు సకాలంలో సేవలందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. వీల్‌చైర్ల కోసమే గంటల తరబడి నిరీక్షిస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిణామాలతో జీజీహెచ్‌కు వచ్చి ఆపై వెనుదిరిగి ప్రైవేట్ ఆస్పత్రులను పలువురు ఆశ్రయిస్తున్నారు.

రోగులకు స్వాగతం పలుకుతున్న సమస్యలు

- వీల్‌చైర్ పొందాలంటే రోగులకు నరకం
- కుక్కల సంచారంతో హడల్
- మార్చురీ గది తలుపులను చెదలు తినేశాయ్..
- నిధులున్నా పట్టించుకోని వైనం

నెల్లూరు(అర్బన్): అధికారుల నిర్లక్ష్యం కారణంగా నగరంలోని జీజీహెచ్‌లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఇక్కడ నైపుణ్యం గల డాక్టర్లు.. వివిధ వైద్యసేవలు అందుబాటులో ఉండటంతో రోజూ ఓపీ పేషెంట్లు వెయ్యి నుంచి 1200 మంది వరకు వస్తుంటారు. అయితే రోగులకు సకాలంలో వైద్యసేవలందించడంలో ఇక్కడి వారు దారుణంగా విఫలమవుతున్నారు.

మార్చురీకి దిక్కేదీ..?

వివిధ మృతదేహాలకు పెద్దాస్పత్రిలోని మార్చురీ గదిలో పోస్ట్‌మార్టం చేస్తుంటారు. ఇలా రోజూ రెండు నుంచి నాలుగు మృతదేహాలకు పోస్ట్‌మార్టం జరుగుతుంటాయి. పోలీస్ పంచనామా జరిగేంత వరకు ఇక్కడే భద్రపర్చాల్సి ఉంటుంది. అయితే పోస్ట్‌మార్టం హాల్ వద్ద తలుపులు సైతం సక్రమంగా లేవు. తలుపులను చెద పురుగులు తినేశాయి. మరికొన్ని చోట్ల చెదలు పట్టి ఉన్నాయి. అనుకోని ఘటన జరిగి మృతదేహాలు మాయమైతే పరిస్థితి ఏమిటనే సందేహం కలగకమానదు.

వీల్‌చైర్లు ఎక్కడుంటాయో..?

ఆస్పత్రికి వచ్చిన సమయాల్లో నడవలేని రోగులు నరకం అనుభవిస్తున్నారు. వీల్‌చైర్ దొరకడం గగనం, ఒకవేళ లభ్యమైనా నెట్టుకెళ్లేందుకు సిబ్బంది లేరు. ఈ క్రమంలో రోగుల సహాయకులే వీటిని తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. గతంలో దాతల ద్వారా 15 వీల్‌చైర్లను ఆస్పత్రికి హెచ్‌డీఎస్ కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద అందించారు. అయితే వీటిని ఎక్కడ ఉంచుతున్నారో అంతుపట్టడంలేదు. మడతేసిన దుస్తులు, చిన్న ఆక్సిజన్ సిలిండర్లను నెట్టుకెళ్లేందుకు వీటిని వినియోగిస్తున్నారు.

రిపోర్టులా.. సారీ

ఎమ్మారై, సీటీ తదితర స్కానింగ్ పరీక్షలు చేస్తున్నా, ఫిల్మ్ ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. రిపోర్టు అడిగితే రేడియాలాజిస్టుల కొరత అనే సమాధానం వస్తోంది. ఈ ఫిల్మ్‌లను బయట స్కాన్ సెంటర్లకు తీసుకెళ్లి అక్కడ రూ.500 సమర్పించి రిపోర్టులను తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఎమ్మారై రిపోర్టు సకాలంలో అందక రోగుల పరిస్థితి ఇబ్బందికరంగా మారిన ఉదంతాలూ చోటుచేసుకున్నాయి.

నిధుల వినియోగంపై శ్రద్ధేదీ..

వాస్తవానికి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్)లో నిధులు సమృద్ధిగా ఉన్నాయి. ఆస్పత్రిలో కాన్పులు, ఇతర ఆపరేషన్లను ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్నారు. ఈ క్రమంలో కొంత మొత్తం వాటాగా ఆస్పత్రికి వస్తుంది. ఈ మొత్తంతో పాటు ఇతర ఆదాయ వనరుల ద్వారా వచ్చే నగదునూ హెచ్‌డీఎస్‌లో జమచేస్తున్నారు. ఇలా లక్షలాది రూపాయల నిధులున్నా, చిన్న మరమ్మతులను చేయించడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు.

వీల్‌చైర్ లేక కాజ్యువాల్టీకి బైక్‌పై..!



నగరానికి చెందిన ఓ యువకుడు తమ బంధువైన వృద్ధురాలిని పెద్దాస్పత్రికి మూడు రోజుల క్రితం తీసుకొచ్చారు. ఆమె కాలుకు గాయమై పెద్ద కట్టుతో ఉండటంతో నడవలేని పరిస్థితి. ఈ క్రమంలో అక్కడి వైద్య సహాయకులు, సిబ్బందిని వీల్‌చైర్ కోసం అభ్యర్థించారు. వేరే చోటుకు తీసుకెళ్లారు.. కొద్దిసేపు ఆగండంటూ అర్ధగంట పాటు సిబ్బంది కాలయాపన చేశారు. ఈ తరుణంలో సహనం కోల్పోయిన యువకుడు సదరు వృద్ధురాలిని తన బైక్‌పై ఎక్కించుకొని ర్యాంపుపై నుంచి నేరుగా ఆస్పత్రిలోని కాజ్యువాల్టీ వైపునకు వెళ్లారు. అప్పుడు మేల్కొన్న వైద్య సిబ్బంది హుటాహుటిన వెళ్లి వీల్‌చైర్‌ను తీసుకొచ్చారు. ఇప్పటి వరకు లేని వీల్‌చైర్ ఇప్పుడెలా వచ్చిందంటూ యువకుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఓ ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి ఇక్కడ నిత్యకృత్యమే.

కుక్కల స్వైర విహారం



పెద్దాస్పత్రిలోని వార్డుల వద్దకు కుక్కలు రాత్రి వేళ పెద్ద ఎత్తున వస్తున్నాయి. వీటిని నియంత్రించే దిశగా ఎవరూ చర్యలు చేపట్టడంలేదు. కుక్కలు తమను కరిస్తే పరిస్థితి ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు రోగుల బాత్‌రూమ్‌లను సక్రమంగా శుభ్రం చేయడంలేదనే ఫిర్యాదులు నిత్యం వస్తున్నాయి.





వీల్‌చైర్‌లో ఆక్సిజన్ సిలిండర్ల తరలింపు



చెదలకు ఆహారమైన మార్చురీ గది తలుపులు

సమస్యలను చక్కదిద్దుతున్నాం

కొన్ని సమస్యలు నా దృష్టికి వచ్చాయి. వీటిని పరిష్కరిస్తున్నాం. వీల్‌చైర్లను రోగులకు మాత్రమే వినియోగించాలని ఆదేశాలిచ్చాం. ఎమ్మారై రిపోర్టులను ఇచ్చేలా చర్యలు చేపడతా. మార్చురీ గదికి కొత్త తలుపులను ఏర్పాటు చేయిస్తాం. కుక్కలను పట్టుకోవాలని కోరుతూ నగరపాలక సంస్థ అధికారులకు లేఖ రాశాం. సమస్యలను చక్కదిద్ది రోగులకు మెరుగైన సేవలందిస్తాం.

– సిద్ధానాయక్, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధి

- మంత్రులు ఆనం, నారాయణ



మాట్లాడుతున్న మంత్రులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేల సహకారం, సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ తెలిపారు. జిల్లాలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని చింతారెడ్డిపాళెంలోని తన క్యాంప్ కార్యాలయంలో నారాయణ శనివారం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఆనంద్, జేసీ సేదు మాధవన్ హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మంత్రులు మాట్లాడారు. అభివృద్ధి పనులపై ప్రణాళికను రూపొందిస్తున్నామని వివరించారు. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు సహకారాన్ని అందిస్తామని వెల్లడించారు.

సోమశిల ప్రాజెక్ట్ అభివృద్ధి పనులు పూర్తి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని జిల్లాకు ఆహ్వానించి సోమశిల జలాశయంలో చేపట్టాల్సిన క్రస్ట్ గేట్ల మరమ్మతులు, ఆప్రాన్, రక్షణ గోడ తదితర అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మంత్రులు తెలిపారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, నెలవల విజయశ్రీ, పాశం సునీల్ కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, కావ్య కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం యథేచ్ఛగా తవ్వకాలు

ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో దుర్గంపై తవ్వకాలు శుక్రవారం రాత్రి సైతం జరిగాయని తెలుస్తోంది. ఈ అనుమానాలను బలపరుస్తూ దుర్గంపై రాత్రి వేళ టార్చిలైట్ వెలుతుర్లు కనిపిస్తున్నాయి. పది రోజుల క్రితం ఇదే తరహాలో పరిస్థితులు ఏర్పడటంతో అటవీ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. తవ్వకాల కోసం ఉపయోగించిన సామగ్రి లభ్యమైన విషయం విదితమే. ఘటన జరిగి వారం గడవక ముందే తవ్వకాల ముఠా తమ కార్యకలాపాలను మరోసారి సాగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి వాటికి పాల్పడే వారిపై అధికారులు ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం లేదా..?



విద్యార్థినికి నగదు పురస్కారాన్ని అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహకాలను అందించింది. ఈ కార్యక్రమానికి కొత్త ప్రభుత్వం మంగళం పాడిందని తెలుస్తోంది. గతేడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందాయి. ఈసారి జూలై మొదలైనా ఆ విషయాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు.

- ప్రతిభ గల విద్యార్థులకు అండగా నిలిచిన గత ప్రభుత్వం
- జగనన్న ఆణిముత్యాల పేరిట నగదు పురస్కారాలు
- ఈ విషయంపై దృష్టి సారించని చంద్రబాబు సర్కారు
- ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

దుత్తలూరు: విద్యారంగానికి వైఎస్సార్సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఓ వైపు సర్కారు బడులను అభివృద్ధి చేస్తూనే.. మరోవైపు ప్రతిభ కలిగిన విద్యార్థులను అడుగడుగునా వెన్నుతట్టి ప్రోత్సహించింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనే గొప్ప ఆశయంతో 'జగనన్న ఆణిముత్యాలు' పథకానికి శ్రీకారం చుట్టింది. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించడంతో పాటు వారి తల్లిదండ్రులు, ఇంకా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సైతం సత్కరించింది. ఈ కార్యక్రమాన్ని ఏటా అమలు చేయనున్నామని అప్పటి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఈ ఏడాదీ నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. అయితే కొత్త ప్రభుత్వంలో ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి సమాచారం లేదు.

ఎంపిక చేసి..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో ఇంటర్ చదివి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకాలను అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానానికి రూ.50 వేలను అందించారు. అలాగే ఇంటర్మీడియట్‌లోని ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ వంటి ప్రతి గ్రూపులో టాపర్లకు నగదు బహుమతులిచ్చారు. అలాగే సర్టిఫికెట్లు, మెడళ్లనూ ఇచ్చి ప్రోత్సహించారు. నగదు ప్రోత్సాహకాలను కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానానికి రూ.30 వేలు, తృతీయ స్థానానికి రూ.15 వేల చొప్పున ఇచ్చారు. నియోజకవర్గ స్థాయిలో టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.ఐదు వేల చొప్పున అందజేశారు. ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని కొంతమంది దాతలు సైతం పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

ఇస్తారా.. లేదా..?

ఆణిముత్యాలు పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందలేదని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. గతేడాది జూన్ 20 నాటికే అన్నిస్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి కూడా గొప్ప స్పందన లభించింది. విద్యార్థులకు నగదు పురస్కారం ఈ ఏడాది అందుతుందా లేదాననేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందకపోవడంతో అధికారులు సైతం ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఈ ఏడాది పదో తరగతిలో 24,500 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 17,292 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేలా నగదు పురస్కారాలను అందించాలని పలువురు కోరుతున్నారు.

ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం



సమీక్ష సమావేశంలో అధికారులు

నెల్లూరు(బారకాసు): సఫాయి కర్మచారీల జీవన స్థితిగతులను మెరుగుపర్చడంతో పాటు వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావ పేర్కొన్నారు. సఫాయి కర్మచారీల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై నగరంలోని కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో గల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులతో శనివారం సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పాటుపడే వీరి ఆర్థిక పురోభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో వీరికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. హెల్త్ కార్డుల మంజూరు, హెల్త్ ఇన్సురెన్స్ తదితరాల అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ మరణిస్తే బాధితులకు పరిహారంగా రూ.పది లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చెల్లించాలన్నారు. సఫాయి కర్మచారీల అభివృద్ధికి నెల్లూరు నగరపాలక సంస్థ విశేష కృషి చేస్తోందని, దీనికి కమిషనర్ వికాస్ మర్మత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జేసీ సేదు మాధవన్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ వ్యవహారం.. రోజుకో మలుపు

- మేయర్ భర్త చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- తెరపైకి మరో వ్యక్తి
- తాజాగా ఎస్పీకి కమిషనర్ ఫిర్యాదు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకున్న ఫోర్జరీ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా మేయర్ భర్త జయవర్ధన్‌పై ఎస్పీకి కమిషనర్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మరో వ్యక్తి ప్రమేయం వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది. కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారనే అంశం ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో బాధ్యులైన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన విషయం విదితమే.

కొత్త కోణం వెలుగులోకి..

ఈ వ్యవహారంలో తమకెలాంటి సంబంధం లేదని సస్పెండైన టౌన్‌ప్లానింగ్ విభాగ ఉద్యోగులు షోకాజ్ నోటీసులకు సమాధానమిచ్చారు. మేయర్ భర్త జయవర్ధన్, అతని సహాయకుడు శివకృష్ణ తనఖా పత్రాలకు సంబంధించిన వాటిపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సంతకాలు చేసి, వేలిముద్రలేయాలని ఆదేశించారనే విషయాన్ని తెలియజేశారు. దీంతో ఫోర్జరీ అంశంలో తన విచారణలో బహిర్గతమైన విషయాలను తెలియజేస్తూ మేయర్ భర్తపై ఎస్పీకి కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. మరోవైపు ఫోర్జరీ వ్యవహారంలో శివకృష్ణ పాత్ర ఉందనే అంశం నిర్ధారణైతే అతనిపై క్రిమినల్ ఎంక్వైరీ జరిగే అవకాశం ఉంది. ఈ ఉదంతంలో మరికొందరి ప్రమేయం సైతం ఉండొచ్చని కార్యాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

విజిలెన్స్ విచారణ ఎప్పటికో..

టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫోర్జరీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరుతూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులకు కమిషనర్ లేఖ రాశారు. అయితే ఇది జరిగి దాదాపు నెలకుపైగా గడుస్తున్నా, ఇంత వరకు ఎలాంటి విచారణ జరగలేదని సమాచారం.

అక్రమాలకు అడ్డాగా టౌన్‌ప్లానింగ్

నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విభాగంపై కమిషనర్‌కు గతంలో పలువురు ఫిర్యాదు చేశారు. ఆ విభాగంలో జరిగే అవినీతి, అక్రమాలను ఎవరైనా బహిర్గతం చేసినప్పుడే ఉన్నతాధికారులు దృష్టి సారిస్తుంటారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి విచారణ జరిపితే మరెన్నో విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆ అప్పు.. ప్రాణానికి ముప్పు

బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ యువకుడు లోన్‌యాప్‌లో నగదు తీసుకున్నాడు. సక్రమంగా చెల్లించాడు. అయినా కట్టలేదంటూ నిర్వాహకులు వేధింపులకు దిగారు. ఇంకా ఇంకా కట్టాలంటూ అతని ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లకు కాల్ చేసి తప్పుగా ప్రచారం చేశారు. అతని ఫొటో కింద దొంగ అంటూ క్యాప్షన్ రాసి అందరికీ పంపారు. దీంతో యువకుడు ఆత్మహత్యా యత్నం చేశాడు. కుటుంబసభ్యులు చూసి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

నెల్లూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తన అవసరాల నిమిత్తం లోన్‌యాప్‌లో రూ.20 వేలు తీసుకున్నాడు. తిరిగి చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో యాప్ నిర్వాహకులు ఉద్యోగి కాంటాక్ట్ నంబర్లకు ఫోన్ చేయడంతోపాటు అసభ్యకర సందేశాలను పంపారు. ఫొటోలు మార్ఫింగ్ చేసి పంపించారు. దీంతో అతను స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేధింపులకు బ్రేక్ పడింది. ఇలాంటి సంఘటనలు అనేకం. పరువు పోతుందని చాలామంది ఫిర్యాదు చేయడం లేదు.

- లోన్‌యాప్ వలలో చిక్కుకుంటే వేధింపులే..
- తస్మాత్ జాగ్రత్త



నెల్లూరు(క్రైమ్): లోన్‌యాప్‌లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని వాటి నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. లోన్ పొందే సమయంలో చెప్పిన వడ్డీ రేట్లకు.. చెల్లించే సమయంలో వేసే వడ్డీ రేట్లకు భారీ వ్యత్యాసం ఉండటంతో ప్రజలు మోసపోతున్నారు. నిర్వాహకుల వేధింపులు తాళలేక కొందరు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న అనేక ఆన్‌లైన్ రుణయాప్‌లకు ఆర్‌బీఐ అనుమతులు లేవని, చాలా యాప్‌లు ఇతర దేశాలకు చెందినవని నిపుణులు పేర్కొంటున్నారు. వీటి వలలో చిక్కుకుని ప్రాణాల మీదకు తెచ్చుకోవదని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ఎలాంటి ష్యూరిటీ లేకుండానే..

స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ఎలాంటి ష్యూరిటీ అవసరం లేకుండానే రుణం మంజూరు చేస్తామని లోన్ యాప్స్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు చూసి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. వెంటనే తమ ఫోన్లలో సదరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని నిర్వాహకులు అడిగిన వివరాలు, అనుమతులు ఇవ్వడమే తరువాయి క్షణాల్లో రూ.50 వేల లోపు రుణం ఖాతాల్లో జమైపోతోంది. ఇలా ఆన్‌లైన్ ఆధారిత యాప్ ఉచ్చులోకి లాగుతున్నారు. వడ్డీరేట్లకు భారీ వ్యత్యాసం ఉండటంతో ప్రజలు మోసపోతున్నారు. రుణం మంజూరు చేసే సమయంలో హుందాగా వ్యవహరించే నిర్వాహకులు చెల్లించడం ఒక్కరోజు ఆలస్యమైనా, వడ్డీ వ్యత్యాసంపై ప్రశ్నించినా వేధింపులకు దిగుతున్నారు. యాప్ డౌన్‌లోడ్ సమయంలో మొబైల్ ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు అన్నింటికీ నిర్వాహకులకు యాక్సెస్ ఇవ్వాల్సి వస్తుంది. దీంతో వ్యక్తిగత సమాచారం మొత్తం వారి గుప్పెట్లోకి వెళ్లిపోతుంది. ఇదే ప్రజల పాలిట యమపాశమవుతోంది.

ప్రాణాలు తీసేలా వేధింపులు

తక్షణమే రుణం మంజూరవడంతో ప్రజలు వారి వ్యక్తిగత అవసరాలు తీర్చుకున్నామని భావించేలోగా వారి ఆనందం ఆవిరయ్యేలా నిర్వాహకులు వేధింపులకు పాల్పడుతున్నారు. రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. చెల్లింపులు ఆలస్యమయ్యేకొద్దీ రకరకాల వేధింపులకు గురిచేస్తున్నారు. వడ్డీకి చక్రవడ్డీ వేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తే రుణగ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే పోస్టులు, దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, ఫొటోలు పంపుతున్నారు. అప్పటికీ స్పందించకపోతే సంబంధిత కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లకు పంపుతున్నారు. ఫొటోల కింద రేపిస్ట్, హంతకుడు ఇలా రకరకాల క్యాప్షన్లు రాసి మానసికంగా వేధింపులకు పాల్పడుతున్నారు. వీరి ఆగడాలు తాళలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంకొందరు మరో లోన్‌యాప్‌లో రుణం తీసుకుని వారికి చెల్లిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతూ నిత్యనరకం అనుభవిస్తున్నారు.

మోసపోవద్దు

లోన్‌యాప్‌లలో చాలావరకు ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని వాటిని డౌన్‌లోడ్ చేసుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇన్‌స్టెంట్ లోన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేసే యాప్‌లను నమ్మి మోసపోవద్దని, ఇప్పటికే రుణాలు పొందినవారు వేధింపులకు గురవుతుంటే ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు. ఆధార్‌బ్యాంకు, ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వరాదని నిపుణులు సూచిస్తున్నారు.

వాటి జోలికి వెళ్లొద్దు



ఆర్‌బీఐ అనుమతుల్లేని లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దు. ఇన్‌స్టెంట్‌లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల మొబైల్లోని వ్యక్తిగత సమాచారం వేరేవారి చేతుల్లోకి వెళ్లిపోతుంది. దానిని ఆసరాగా చేసుకుని బెదిరింపులకు పాల్పడే అవకాశాలున్నాయి. ప్రజలు ఈ తరహా యాప్‌ల జోలికి వెళ్లి ఇబ్బందుల్లో పడొద్దు. యాప్‌లో రుణాలు తీసుకుని నగదు సక్రమంగా చెల్లిస్తున్నా.. ఇబ్బందులకు గురిచేస్తుంటే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

సోమిరెడ్డి అవినీతిపై విచారణ చేయించగలరా?

- సీఎం చంద్రబాబును ప్రశ్నించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అక్రమ లేఅవుట్లు వేసింది టీడీపీ పాలనలోనే..
- ఉడత బెదిరింపులకు భయపడను
- ఈనాడు కిరణ్‌కు బహిరంగ లేఖ రాసినట్లు వెల్లడి



మాట్లాడుతున్న మాజీ మంత్రి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): 'సూర్యచంద్రులు చూడలేనివి నేను చూడగలనని సీఎం చంద్రబాబు చెబుతుంటారు. సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. గ్రావెల్, ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఏపీ జెన్‌కో నుంచి అక్రమంగా ఫ్లై యాష్ తరలిస్తున్నారు. వీటిపై విచారణ చేయించగలరా?' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈనాడులో ప్రచురితమైన 'అనుమతి లేకున్నా.. ఉన్నట్లు చూపి ప్లాట్ల విక్రయం' కథనంపై స్పందించారు. ఈ విషయమై పూర్తి ఆధారాలతో చెరుకూరి కిరణ్ (రామోజీరావు తనయుడు)కి లేఖ రాసినట్లు వెల్లడించి మీడియాకు విడుదల చేశారు. ఎన్నడూ లేని విధంగా పొదలకూరు మండలంలో అనధికార లేఅవుట్ల సంప్రదాయాన్ని తీసుకొచ్చిన ఘనత టీడీపీదేన్నారు. 2014 – 2019 మధ్యకాలంలో సోమిరెడ్డి ఎమ్మెల్సీగా, మంత్రిగా పనిచేసిన సమయంలో కొందరి వద్ద డబ్బులు తీసుకుని పొదలకూరు మండలంలో అనధికార లేఅవుట్లకు అనుమతులు ఇప్పించాడన్నారు. అప్పట్లో లేఅవుట్ల విషయంలో జరిగిన అవినీతిపై నాటి విజిలెన్స్ అధికారులు విచారణ చేశారన్నారు. ఉన్నతాధికారులు రూ.6,52,36,405లను లేఅవుట్ల యజమానులకు పెనాల్టీ విధించారన్నారు. సోమిరెడ్డి వారి నుంచి రూ.2 కోట్లు ముడుపులు తీసుకున్నాడని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శులను బెదిరించి అక్రమ లేఅవుట్లకు సంబంధించి పెనాల్టీ వసూలు చేయకుండా అడ్డుకున్నాడని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ లేఅవుట్లపై బీజేపీ నాయకుడు అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. 2019 సెప్టెంబర్ 14వ తేదీన విచారణకు ఆదేశించారన్నారు. పొదలకూరు మొత్తంలో 40 లేఅవుట్లను అక్రమంగా వేసినట్లు డివిజినల్ పంచాయతీ అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారన్నారు. 25 లేఅవుట్లకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ కూడా జరగలేదని విజిలెన్స్ అధికారులు తేల్చారన్నారు. ఇళ్ల ప్లాన్లను సైతం చట్టాలకు విరుద్ధంగా టీడీపీ వారి ప్రోద్బలంతో పంచాయతీ కార్యదర్శులు మంజూరు చేసినట్లు గుర్తించి వారిపై క్రమశిక్షణ చర్యలకు అధికారులకు సిఫార్సు చేశారన్నారు. సోమిరెడ్డిని వదిలి అధికారులను బలిపశువులు చేయడం మంచిది కాదని వారికి అండగా నిలిచామన్నారు.

ప్రచురించే దమ్ముందా?

ఈనాడు పత్రికకు విలువలు ఉంటే తాను పేర్కొన్న అంశాలను పూర్తి వివరాలతో లేఖ వెంట జత చేసి పంపుతున్నానని కాకాణి అన్నారు. వాస్తవాలో కాదో నిర్ధారించి ప్రచురించే దమ్ము ఉందా అని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. 'టీడీపీ అధికారంలోకి వచ్చిన నెలరోజులకే ఏపీ జెన్‌కో నుంచి అక్రమంగా ఫ్లై యాష్ తరలిస్తూ సోమిరెడ్డి సొమ్ము చేసుకుంటున్నాడు. లేఅవుట్ల యాజమాన్యాల నుంచి అక్రమంగా కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నాడు. అల్లీపురంలో ఆయన ఇంటి చుట్టూ అక్రమ లేఅవుట్లున్నాయి. ఎన్నికల్లో రూ.20 కోట్లు ఖర్చయింది. డబ్బు ఇవ్వాలని కంపెనీల యాజమాన్యాలను పిలిచి బలవంతంగా వసూళ్లకు పాల్పడున్నాడు' ఈ విషయాలను పత్రికలో రాసే దమ్ముందా అని కిరణ్‌ను ప్రశ్నించారు. సర్వేపల్లి చరిత్రలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ఈనాడు పేపర్ బాయ్‌గా వ్యవహరిస్తున్న చంద్రమోహన్‌రెడ్డిపై ఆధారాలతో సహా వివరించేందుకు సిద్ధంగా ఉన్నా.. ప్రచురించడానికి నువ్వు సిద్ధమా అనడిగారు. డొంక, పోరంబోకు స్థలాల్లో లేఅవుట్లు వేసేందుకు కొందరు సిద్ధమవుతున్నారన్నారు. పరిశ్రమల యాజమాన్యాలను డబ్బు డిమాండ్ చేయడం వాస్తవం కాదా అని సోమిరెడ్డిని ప్రశ్నించారు. పొదలకూరులో లేఅవుట్ల వారి నుంచి డబ్బులు డిమాండ్ చేశానని రుజువు చేయగలవా అనడిగారు. ఉడత బెదిరింపులకు బెదిరేదిలేదన్నారు. తనపై వచ్చిన అభియోగాలపై విచారణకు సిద్ధమని ప్రకటించారు. సీబీఐ, సీబీసీఐడీ చేత విచారణ చేయిస్తావో నీ ఇష్టమన్నారు. తిన్న ప్రతి రూపాయి కక్కించే రోజు వస్తుందన్నారు. సోమిరెడ్డి వల్ల అధికారులు మితిమీరి వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన బుజబుజ నెల్లూరు క్రాస్‌రోడ్డు మల్లారెడ్డి ధాబా సమీపంలో శనివారం జరిగింది. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సౌత్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కావలిలో స్టేడియం నిర్మాణానికి చర్యలు

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

కావలి: పట్టణంలో స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కావలిలోని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఉదయగిరి రోడ్డులో క్రీడా శాఖకు చెందిన ఖాళీ మైదానాన్ని మంత్రికి ఎమ్మెల్యే చూపించారు. ఇక్కడ స్టేడియం నిర్మించాలని కోరారు. దీంతో మంత్రి మాట్లాడుతూ డీపీఆర్‌ను సిద్ధం చేసి అందజేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 137
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 274
లేయర్ చికెన్	: 195

అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది

- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: 'టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయి. ఎవరూ అధైర్యపడొద్దు. పార్టీ అధిష్టానం అన్ని విధాలా అండగా ఉంటుంది. మంచిరోజులు వస్తాయి' అని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక మండలంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తుమ్మల బాలయ్య ఇంటి ప్రహరీ, మెట్లను టీడీపీ కార్యకర్తలు జేసీబీతో కూలదోశారు. దీంతో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పర్వతరెడ్డి, మేకపాటి శనివారం గ్రామానికి చేరుకుని బాలయ్య కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. జగన్ పంపిన రూ.లక్ష చెక్కును వారికి అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. గతంలో ఎవరూ హింసాకాండకు పాల్పడలేదన్నారు. టీడీపీ మాత్రం అధికారంలోకి రాగానే ప్రత్యర్థులపై దాడులకు పాల్పడుతోందన్నారు. పచ్చగా ఉన్న గ్రామాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. అధికారం శాశ్వతం కాదని, ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం మారుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాలో కమిటీ వేశారని, వారు పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, మాజీ కన్వీనర్లు యారం నరసింహారావు, చిమ్మిలి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీలు బంకా మాల్యాద్రి, వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మేకల కొండలరావు, సర్పంచ్‌లు దార్ల గోపీ, మంచాల మల్లికార్జున, దంపూరి రాజశేఖర్, చంద్ర, దప్పుకొట్టు కొండలరావు, విడవలపాటి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.